# విద్యారంగంపై తక్షణ సమీక్ష అవసరం

నేటి నిజం
మంగళవారం 21-7-2020

కరోనా దెబ్బతో ఊహించని విధంగా అన్ని రంగాలు కుదేలయినట్లు గానే విద్యారంగం పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర మానసిక ఆందోళన మొదలయ్యింది. చిన్ని పిల్లలు మొదలు ఉన్నత చదువులు చదువునే వారి వరకు అంతా ఇప్పుడు టెన్షన్‌లో ఉన్నారు. ఇకపోతే కోట్లల్లో ఫీజులు వసూలు చేసి వెనకేసుకున్న ప్రైవేట్ విద్యాసంస్థలు తమ టీచర్లను, అధ్యాపకులను రోడ్డు పడేశాయి. వీరిని అడిగే వారు లేరు. ఎందుకంటే అధికారంలో ఉన్న వారి అండదండలు వీరికి దండిగా ఉన్నాయి. అందుకే టీచర్లు రోడ్డెక్కి భిక్షం ఎత్తుకునే దుస్థితికి మన సమాజాం చేరుకుంది. మరోవైపు ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ఫీజుల వసూళ్లదందా కొనసాగుతూనే ఉంది. వారిని కట్టడి చేయాలని నెత్తీనోరు మొత్తు కుంటున్నా పట్టించుకోవడం లేదు. కరోనా విజృంభన నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం ముందుకు సాగడం ఎలా అన్నదానిపై విద్యార్థులు,తల్లిదండ్రుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ప్రభుత్వం కూడా ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. ఆన్‌లైన్ తరగతులు, ఫీజుల వసూళ్లపై హైకోర్టు స్పందించిన అధికారులు మాత్రంనిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. వాస్తవానికి ఏటా జులై, ఆగస్టుల్లో స్వదేశీ, విదేశీ విద్యాసంస్థల్లో చదివేందుకు ప్రవేశపరీక్షలు,అడ్మిషన్లతో బిజీబిజీగా ఉండే విద్యార్థులు కరోనా నేపథ్యంలో గత నాలుగునెలలుగా ఇంటికే పరిమితం కావడంతో వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. పేరున్న కార్పోరేట్ స్కూళ్లు, కార్పోరేట్ పాఠశాలలు ఇంతకాలం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి జలగల్లా పీల్చి పిప్పిచేసి సంపాదించిన డబ్బుల్లో కనీసం రూపాయి కూడా ఖర్చు చేయడం లేదు. తమ వద్ద పని చేసిన అధ్యాపకులను బిచ్చగాళ్లుగా మార్చి రోడ్డున పడేశారు. హైస్కూల్,ఇంటర్, డిగ్రీ విద్యార్థుల పరిస్థితి మరీ అయోమయంగా ఉంది. పది పూర్తయిన విద్యార్థులు ఎక్కడ చదవాలో, ఎటు వెళ్లాలో కూడా తెలియక ఆందోళనలో ఉన్నారు. పట్టణప్రాంతాల్లో ప్రైవేటు కాలేజీలకు వెళదామంటే కరోనా భయం వెంటాడుతోంది. దాంతో స్థానిక కాలేజీలకే ఈసారి ప్రాధాన్యం ఇస్తున్నారు. డిగ్రీ విద్యార్థుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. దూరప్రాంతాలకు వెళ్లి అనారోగ్యం పాలవుతామన్న ఆందోళనతో ఈసారి విద్యార్థుల చదువుల కలలు కల్లలుగా మారుతున్నాయి. ఇకపోతే విదేశీ విద్య అభ్యసించాలని కలులకన్న వారికి సైతం కష్టాలు తప్పడం లేదు. వారు ఇప్పట్లో విదేశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు ఆగస్టులో ఎంఎస్ నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు సన్నద్ధం అవుతారు. వేలసంఖ్యలో విద్యార్థులు ఏటా చదువుల కోసం విదేశాలకు వెళ్తారు. కానీ ఈ సంవత్సరం జీఆర్ఈ, టోఫెల్ తదితర పరీక్షలు రాసి విదేశాలకు వెళ్లేందుకు సన్నద్ధం అయ్యే తరుణంలో కరోనా దాడి చేయడంతో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. డాలర్ కలలు కన్న వారికి అగ్రరాజ్యంలో అడుగు పెట్టే చాన్స్ లేకుండా పోయింది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనాడా, బ్రిటన్ తదితర దేశాలకు వెళ్లలేని దుస్థితి ఎంతకాలమన్నది ఇప్పుడే చెప్పలేకపోతున్నారు. ఈ ఏడాది విదేశీ యూనివర్శిటీలు ఆగస్టులో వెళ్లేవారిని అనుమతించడం లేదు. కేవలం ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్లు తీసుకుని మొదటి సెమిస్టర్ స్థానికంగా ఉండి చదువుకోవాలని, కరోనా పరిస్థితి మెరుగుపడితే రెండోసెమిస్టర్ చదివేందుకు తమదేశాలకు రావాలని సూచిస్తున్నారు. అయితే విదేశాలకు వెళ్లే విద్యార్థుల ఫీజులను కూడా ఆఫ్‌లైన్ మాదిరాగానే ఆన్‌లైన్ బోధనకూ వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యలోఓ లక్షల్లో ఫీజు చెల్లించినా రెండోసెమిస్టర్ నాటికి వీసా అనమతిలేకపోతే పూర్తిగా స్థానికంగా ఉండి ఆన్‌లైన్‌లో ఉన్నత విద్య పూర్తిచేయాల్సి వచ్చే ప్రమాదం ఉంది. అయితే సహజంగా తెలుగు విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదివిన తర్వాత అక్కడే ఉద్యోగాలు పొందేందుకే విదేశీ చదువులను ఎంచుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ యూవర్శిటీల్లో ఆన్‌లైన్ చదువులకు విద్యార్థులు ముందుకు రావడంలేదు. దీతోదేశవ్యాప్తంగా పలు కన్సలటెన్సీలు కూడా తమ దుకాణాలు తెరవలేదు. ఓ రకంగా ఈ రంగం కూడా కుదేలయ్యిందనే చెప్పాలి. వాస్తవానికి సీజన్‌లో ఒక్కో కన్సలటెన్సీ నుంచి 50మందికిపైగా విద్యార్థులు విదేశీ చదువులకు వెళుతుం టారు. కానీ ఈసారి ఒక్క విద్యార్థి కూడా ఆగస్టులో వెళ్లే పరిస్థితి లేదు. ఎవరూ అడ్మిషన్లు కూడా తీసుకోవడం లేదు. లక్షల్లో ఫీజులు కట్టి తీరా వీసారాకపోతే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. ట్రంప్ విధానాల కారణంగా ఎంస్ కోసం అమెరికా వెళ్లాలనుకున్న వేలాదిమంది విద్యార్థులు తమ ప్లాన్‌ను డ్రాప్ చేసుకున్నారు. ఆఫ్‌లైన్ చదువుకు అనుమతి ఉండి వీసాకు అనుమతిస్తే వెళ్లడానికి సిద్ధమేనని కొందరు విద్యార్థులు కన్సలానీలకు చెబుతున్నా.. వారు కూడా గ్యారెంటీ ఇవ్వలేమని అంటున్నారు. తల్లిదండ్రులు కూడా కరోనా భయంతో ఈఏడాది విదేశీ యూనివర్శిటీలకు తమ పిల్లలను పంపడానికి ఇష్టపడడం లేదు. ఇక్కడే ఏదో ఓ చదువు చదువుకునేలా ప్లాన్ చేస్తున్నారు. ఇకపోతే దేశ వ్యాప్తంగా బీటెక్, ఎంటెక్, మెడిసిన్ వంటి చదువుల చదవాలనుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించలేదు. వాస్తవానికి మేలో ప్రవేశపరీక్షలు పూర్తయి ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించాల్సి ఉండగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆయా విద్యార్థులంతా ప్రవేశ పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లి చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఉన్న కరోనా అయోమయ పరిస్థితుల్లో ప్రవేశపరీక్షల్లో సీటు కొడతామా లేదా అన్నభయంతో ఉన్నారు. ఆగస్టులో ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇస్తామని తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రకటించడంతో ఇక్కడ ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను వెతికే పనిలో పడ్డాయి. ఎలాగూ ఎంసెట్ ఉండకపోవచ్చన్న వాదనా ఉంది. దీంతో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసేందుకు కొందరు రంగంలోకి దిగారు. డీమ్డ్ యూనివర్శిటీలు మాత్రం ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్షలు పెడుతూ ఇంటర్ మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్ సీట్లు భర్తీ చేస్తున్నాయి. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు కూడా మేనేజ్ మెంట్ సీట్లను భర్తీ చేసుకుంటున్నాయి. వాస్తవానికి యూజీసీతోపాటు ఏఐసీటీఈనుంచి అడ్మిషన్లకు అనుమతి కలిపించలేదు. హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగళూరు, పంజాబ్ తదితర యూనివర్శి టీలు ఫోన్ల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి అడ్మిషన్లు బుక్ చేసుకుంటున్నాయి. ఇందుకోసం కొన్ని కాలేజీలు లక్షలనుంచి 3లక్షల వరకు అడ్వాన్సు ఫీజులు తీసుకుంటున్నాయి. స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలు కూడా మేనేజ్‌మెంట్ సీట్లను రూ. 25వేల నుంచి లక్షవరకు సీటు రిజర్వేషన్ పేరుతో అనధికారికంగా తీసుకుంటున్నాయి. ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లో తమ కాలేజీలో సీటువస్తే ఫీజు మినహాయిస్తామని వేరే కాలేజీలో సీటు వస్తే సగం ఫీజు ఇస్తామని మరికొన్ని కాలేజీలు ముందే షరతులు పెడుతున్నాయి. ఇక ఇతర రాష్ట్రాల్లో చదవాలనుకునే విద్యార్థులు కూడా కరోనా నేపథ్యంలో తమ ప్రయత్నాలను ప్రస్తుతానికి నిలిపేశారు. స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ముఖ్య డీమ్డ్‌యూనివర్శటీలకు, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు ఈసారి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల డీమ్డ్ ఇంజనీరింగ్ యూనివర్శిటీలకు, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు డిమాండ్ పెరగడంతో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల రేటు కూడా పెంచారు. మొత్తంగా విద్యారంగ పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. దీనిపై విద్యావంతులు, మేధావులతో కేంద్రమే చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దేశీయంగా విద్యారంగంపై సమీక్షించి కరోనా నేపథ్యంలో మన విద్యారంగం ఎలా ఉండాలో సమీక్షించాలి. విదేశీ విద్యాకు వెళ్లేవారు ఎలా ప్రిపేర్ కావాలో సూచనలు చేయాల్సి ఉంది.

## గోదావరి జలాల రాకతో రైతుల్లో ఆనందం

### త్వరలోనే చెరువులను నింపే కార్యక్రమం
### ఉమ్మడి జిల్లాలో తీరనున్న నీటి కరువు

నల్లగొండ,జూలై20(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది వానకాలం సాగుకు ముందే నీరు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి నీటిని నిర్జీవంగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వలకు మళ్లించింది. గతేడాది సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ కాల్వల్లో 6 నెలలపాటు నిరంతరాయంగా గోదావరి జలాలు పరవళ్లు తొక్కాయి. డీబీఎం–69, 70, 71 కాల్వల ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలను నింపడమే కాకుండా ప్రతి ఎకరాకూ సాగునీరందిం చారు. యాసంగిలో టెయిల్ టు హెడ్ విధానంలో వరిపంట పండేవరకు నిరంతరాయంగా నీటిని విడుదల చేశారు. ÷ఖంతో యాసంగిలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో అత్యధికంగా ధాన్యం దిగుబడి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొట్టమొదటి ఫలితాన్ని అందుకున్న జిల్లాగా సూర్యాపేట రికార్డులకెక్కింది. ఈ యేడుకూడా మరో రెండురోజుల్లో జిల్లాలోకి గోదారమ్మ అడుగుపెట్టబోతోంది. ఈ నెల 15న ఎల్ఎండీ నుంచి కాకతీయ కాల్వకు గోదావరి జలాలను విడుదల చేయగా నేడో, రేపో జిల్లాకు చేరుకోనున్నాయి. దీంతో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని ఎస్సారెస్పీ కాల్వల్లో గోదావరి గలగలలు వినిపించనున్నాయి. గతేడాది ఆరు నెలలపాటు జలాలు నిరంతరం ప్రవహించగా ఆయకట్టు భూములన్నీ సస్యశ్యామలమయ్యాయి. చెరువులు, కుంటలు సైతం నిండాయి. జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు గోదావరి నీళ్లను పారించడమే కాకుండా చెరువులన్నింటినీ నింపనున్నారు. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో ఎస్సారెస్పీ రెండోదశ కింద 2,12,960 ఎకరాల ఆయకట్టులో పంటలు సాగు కానుండగా 348 చెరువులు నిండనున్నాయి. ఇందులో అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల పరిధిలో 92,456 ఎకరాల ఆయకట్టుతోపాటు 196 చెరువులుండగా, సూర్యాపేట నియోజకవర్గంలోని సూర్యాపేట, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్ మండలాల పరిధిలో 80,637 ఎకరాల ఆయకట్టుతోపాటు 110 చెరువులు, కోదాడ నియోజకవర్గంలోని మునగాల, మోతె మండలాల పరిధిలో 39,866 ఎకరాల ఆయకట్టుతోపాటు 42 చెరువులు ఉన్నాయి. గత యాసంగిలో 6 నెలలు నిరంతరాయంగా గోదావరి నీటిని విడుదల చేయడంతో మండు వేసవిలో సైతం ఈ చెరువులన్నీ నిండుకుండలా మారాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టు చరిత్రలో ఇప్పటివరకు నిరంతరాయంగా ఎస్సారెస్పీ రెండోదశకు నీళ్లిచ్చిన దాఖలాలు లేవు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు రెండోదశ కింద జిల్లాలో 2,12,960 ఎకరాల ఆయకట్టు ఉంది.

## సాగునీటి విషయంలో చిత్తశుద్ది చాటిన కెసిఆర్

### –బీడు భూములకు సైతం గోదావరి జలాలు: : ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ,జూలై20(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ పాలనలో రైతన్న రెట్టింపు ఉత్సాహంతో వరిసాగుకు సిద్ధమవుతున్న దృశ్యాలు జిల్లాలో కండ్లముందు కనువిందు చేస్తున్నాయి. ఎస్సారెస్పీ కాల్వలకు గోదావరి జలాలు రానుండడంతో జిల్లాలో అన్నదాతలు ఆనందంతో వానకాలం వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. సాగునీటి విషయంలో సిఎం కెసిఆర్ , మంత్రి జగదీశ్వర్ రెడ్డిలు చిత్తశుద్దితో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. నీటి విడుదల ప్రకటనకు ముందే గత యాసంగిలో నిరంతరాయంగా నీటి విడుదల చేయడంతో భూగర్భ జలాలు పైపైకి వచ్చి జలసిరులు కురిపిస్తుండడంతో రైతులంతా వరినార్లు పోసి సాగుకు సిద్ధంగా ఉన్నారు. బీడు భూములను సైతం చదును చేసి వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో నీళ్లులేక భూములను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలసపోయిన రైతులు సైతం నేడు గ్రామాలకు వచ్చి సాగుబాట పట్టారు. గతంలో నీళ్లు లేక భూమి పడావుగా ఉండేది. ఎస్సారెస్పీ కాల్వల గోదావరి నీళ్లు వస్తుండడంతో అందులో సాగుచేయబోతున్నారు. రైతుబంధు పథకంలో వచ్చిన డబ్బులతో పెట్టుబడులకు ఢోకా లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. పడావు భూముల్లో సైతం సిరుల పంటలు పండించే విధంగా రైతన్నలను ప్రోత్సహిస్తున్నది ముమ్మాటికీ టీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. గత యాసంగిలో ఈ ఆయకట్టే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల ఆయకట్టుకు కూడా గోదావరి నీళ్లందాయి. ప్రాజెక్టు చరిత్రలో ఈ స్థాయిలో నీళ్లు ఆయకుట్టుకు రాలేదు. బోర్లు, బావుల మోటర్లు బంద్‌పెట్టి కాల్వల ద్వారానే నీళ్లు పారించి పంట పండించిన గ్రామాలు జిల్లాలో చాలానే ఉన్నాయి. భూగర్భజలాలు పెరగడంతో బోర్లు, బావుల్లోకి పుష్కలంగా నీళ్లొచ్చాయి. దీంతో వరిసాగుకు ఢోకా లేకుండా పోయింది. ప్రస్తుతం వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో గోదావరి నీటి విడుదల ప్రకటన రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

## అమెరికా కాంగ్రెస్ సభ్యుడు జాన్ లూయిస్ మృతికి సంతాపం వ్యక్తం చేసిన – ప్రధానమంత్రి

హైదరాబాద్, జులై 20:అమెరికా కాంగ్రెస్ సభ్యుడు జాన్ లూయిస్ మృతికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు.

ఈ మేరకు ప్రధానమంత్రి ఒక ట్వీట్ చేస్తూ, " పౌర హక్కుల నాయకుడు, అహింసా వాది, గాంధేయ విలువలకు కట్టుబడిన మానవతావాది అయిన అమెరికా కాంగ్రెస్ సభ్యుడు జాన్ లూయిస్ ను కోల్పోయినందుకు మేము సంతాపం వ్యక్తం చేస్తున్నాము. ఆయన ఓర్పు, ప్రేరణ, వారసత్వంగా ఎల్లప్పుడూ కొనసాగుతూనే ఉంటాయి." అని పేర్కొన్నారు.

# జంక్ ఫుడ్‌తో జరదూరం – కరోనా ఉంది జరభద్రం

### (21 జూలై జాతీయ జంక్ ఫుడ్ దినం సందర్భంగా)

హైదరాబాద్, జులై పాశ్చాత్య దేశాల వంటింటిని జంక్ ఫుడ్ ఎప్పుడో దండయాత్ర చేసింది. అమెరికాలో జంక్ ఫుడ్ లేకుండా ఒక్క పూట భోజనం కూడా గడవని స్థితి వచ్చింది. 1950 తరువాత గుర్తించిన 'జంక్ ఫుడ్' పదాన్ని (జంక్ అనగా చెత్త అని అర్థం) మైక్రోబయాలజిస్ట్ మైఖేల్ జాకబ్సన్ రూపొందించారు. ఇప్పుడు భారతదేశంలో కూడా జంక్ మరియు ఫాస్ట్ ఫుడ్ వాడకం శరవేగంగా పెరుగుతోంది. మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని శాసిస్తాయి.

నేటి యువత జంక్ ఫుడ్ మరియు ఫాస్ట్ ఫుడ్ టేస్టులకు బానిసలై తమ ఆరోగ్యాలను గాల్లో వదిలేస్తున్నారు. ఆధునిక వేగవంతమైన జీవనశైలిలో యువత కొట్టుకు పోతున్నది. ఫ్యాషన్ల పేరుతో పాడు అలవాట్లకు లొంగిపోతున్నారు. కరోనా కబంధహస్తాల్లో చిక్కిన విశ్వ మానవాళికి శరీరక మానసిక బలం అవసరమవుతున్న విపరీత సమయాన వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడం తప్ప మరో మార్గంలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంక్ మరియు ఫాస్ట్ ఫుడ్‌లకు చరమగీతం పాడుతూ, పోషకాహారాన్ని ఆశ్రయించాల్సిన అగత్యం ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా జంక్ ఫుడ్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ప్రతియేటా 21 జూలై రోజున 'జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం' పాటించడం జరుగుతోంది. ఒక సంవత్సరంలో పొగాకు వాడడం వల్ల 8 మిలియన్ల మరణాలు సంభవిస్తే, జంక్ ఫుడ్ వల్ల 11 మిలియన్ల మరణాలు నమోదు అవుతున్నాయని తేల్చారు. 70 సంవత్సరాల వయస్సు పైబడని వారిలో 22 శాతం మరణాలు జంక్ ఫుడ్ ఆధారిత అనారోగ్యాలతో జరుగుతున్నాయని అంటున్నారు.

అధిక కొవ్వులు, చెక్కరలు, ఉప్పు మరియు ఎక్కువ కాలరీలు కలిగి ఉంటూ, పోషక విలువలు (ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్) లోపించిన లేదా అతి స్వల్పంగా ఉన్న ఆహారాన్ని జంక్ (ఫాస్ట్) ఫుడ్ అంటాం. రెండు శతాబ్దాలకు పూర్వమే అమెరికాలో కాలుమోపిన జంక్, ఫాస్ట్, బేకరీ మరియు ఫ్రోజెన్ ఫుడ్స్ నేడు విశ్వవ్యాప్తం కావడం విచారకరం. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రయాణాలు, అలవాట్లు, రుచులు, చూపులకు ఇంపైన జంక్ ఫుడ్ ఉత్పత్తికి సంబంధించిన ప్యాకెట్ ఫుడ్ పరిశ్రమ అనేక రెట్లు పెరిగి అన్ని దేశాల నలుమూలల సూపర్ మార్కెట్లకు విస్తరించింది. అతి వేపుడు లేదా డీప్ ఫ్రై చేసిన జంక్ ఫుడ్ ద్వారా స్థూలకాయం, కొలెస్టరాల్ మరియు షుగర్ పెరుగుతూ జీవనశైలి రుగ్మతలు (గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు) కలుగుతాయి. షుగర్స్ అధికంగా ఉన్న బర్గర్లు, పిజ్జాలు, వైట్ బ్రెడ్, వేపుల్లు, పేస్ట్రీస్, కుకీస్, కేక్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు, చాకోలేట్స్, ప్రాసెస్డ్ మీట్ మరియు ఛీజ్, స్ట్రీట్ ఫాస్ట్ ఫుడ్స్ లాంటి అనేక ఆహార పదార్థాలు జంక్ ఫుడ్స్ జాబితాలోని వస్తాయి.

భారతదేశంలో జంక్ మరియు ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి దినదినం పెరుగుతోంది. మహానగరాలకే పరిమితమైన జంక్ ఫుడ్ నేడు చిన్న పట్టణాలలోకి ప్రవేశించింది. 1996లో దేశ రాజధానిలో ప్రారంభమైన మక్ డొనాల్డ్ (జంక్ ఫుడ్) సెంటర్, నేడు దేశవ్యాప్తంగా 400లకు పైగా సెంటర్లను నడుపుతోంది. మన దేశంలో 380 కెయఫ్‌సి సెంటర్లు నడుస్తున్నాయి. చిన్న కుటుంబాల సంఖ్య పెరగడం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయడం, పరిమిత ఆదాయం రావడం, ఇంట్లో వంట చేసుకున సమయం లేక పోవడం, పిల్లలు బాగా ఇష్ట పడడం లాంటి వివిధ కారణాలతో జంక్ ఫుడ్ వాడకం క్రమంగా పెరుగుతోంది. జంక్ మరియు ఫాస్ట్ ఫుడ్ వినియోగం ఏటా దాదాపు 10 శాతం పెరుతోంది. ఇండియాలో విరివిగా వాడే పూరీలు, పరాటాలు, కుల్చా, బటూరా, కచేరీలు, టిక్కా, భుజియా, నమ్కీన్, పొటాటో చిప్స్, పానీ పూరి, ఆలు బుజియా, బిర్యాని, పకోడి, పలు రకాల బజ్జీలు, బోండాలు లాంటి అనేక ఆహారపదార్థాలు కూడా జంక్ ఫుడ్‌లోకే వస్తాయని నిపుణులు అంటున్నారు. 93 శాతం పిల్లలు వారానికి కనీసం రెండుసార్లు ప్యాకెట్ ఫుడ్ మరియు 56 శాతం ఐస్‌క్రీంలు, చాకొలెట్లు తింటున్నారు. 14–17 సంవత్సరాల వయస్సున్న యువత రోజుకొకసారైనా బేకరీ ఫుడ్స్ తింటున్నారని, 40 శాతం పిల్లలు లంచ్ బాక్స్ లలో ప్యాకెట్ ఫుడ్స్ ఉంటున్నాయని తేలింది. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల దాదాపు 14 శాతానికి పైగా పాఠశాల పిల్లలు స్థూలకాయులుగా మారారని తేలింది. పాఠశాల పిల్లల్లో 44 శాతం బాలురు మరియు 56 శాతం బాలికలు జంక్ ఫుడ్ తీసుకుంటున్నారు. ముఖ్యంగా 71 శాతం పిల్లలు చిప్స్, 14 శాతం చాకొలెట్లు, 13 శాతం బేకరీ ఫుడ్స్, 7 శాతం సాఫ్ట్ డ్రింక్స్ మరియు 5 శాతం షుగర్ డ్రింక్స్ వాడుతున్నారని అంచనా వేస్తున్నారు.

కోవిడ్–19 కోరల్లో చిక్కిన మానవాళి బయట పడడానికి ఏకైక మార్గం పోషకాహారం తీసుకోవడం మాత్రమే అని గమనించాలి. కరోనా కట్టడికి నిబంధనలను పాటిస్తూ, వ్యాధినిరోధకశక్తిని పెంచుకోవడం తప్పనిసరి అని సూచిస్తున్నారు. ఇంట్లో వంటలు మాత్రమే తీసుకోవాలి. మాంసాహారం, కోడిగుడ్లు, పాలు, డ్రై ఫ్రూట్స్, విటమిన్–సి కలిగిన పులుపు ఆహారం, విటమిన్–డి గల ఆహారం, విటమిన్లు, జింక్ ధాతువుతో కూడిన ఆహారం, పండ్లు లాంటి ఆహార పదార్థాలను ఎక్కువగా వాడాలి. అల్లం, వెల్లుల్లి, మిరియాలు, శొంఠి, పసుపు, లవంగాల చూర్ణాన్ని వేడి నీటిలో కలిపి తీసుకోవాలి. జంక్ ఫుడ్స్ మరియు ఫాస్ట్ ఫుడ్స్ అన్ని స్లో పాయిజన్లలా మన వెంటపడి అనారోగ్యాలను కలిగిస్తాయని నమ్మాలి. నేటి ఆహారమే రేపటి ఆరోగ్యమని, నేటి ఆరోగ్యమే రేపటి మహాభాగ్యం అని గుర్తుంచుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ధైర్యంగా ఉందాం..కరోనాను కట్టడి చేద్దాం



ఖమ్మం, జులై 20: ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో గల గిరిజన యువత శిక్షణా కేంద్రం (మిఆం) లో ఏర్పాటు చేసిన కొవిడ్ కేర్ సెంటర్ ను సోమవారం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా విషయంలో ఎవరు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదన్నారు.

కరోనా కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ దవాఖాన కాకుండా అదనంగా ఇక్కడ 70, మమత దవాఖానలో 130 బెడ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శారద ఇంజినీరింగ్ కళాశాలలో కూడా కొవిడ్ హెల్త్ కేర్ ఏర్పాటు చేస్తామన్నారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని, తెలంగాణలో కరోనా బారిన పడి నయం అయిన వారి సంఖ్య 98.5% ఉండగా, మరణాలు 1.5% మాత్రమే అని వెల్లడించారు. కరోనా పై పోరాడుతున్న వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి ఆత్మస్థైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ , జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ డీఎం హెచ్ వో మాలతి తదితరులు ఉన్నారు.

## మొక్కల పెంపకం సామాజిక బాధ్యత కావాలి

### –ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి: కలెక్టర్

కరీంనగర్,జూలై20(నేటినిజం ప్రతినిధి): మొక్కల పెంపకం సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె శశాంక అన్నారు. హరితహారం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటామని అన్నారు. నాటిన మొక్కలు రక్షించేలా చూడాలన్నారు. అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో 6వ విడత హరితహారం వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి మండలానికి ఒక మంకీ ఫుడ్ కోర్టు, మియావాకి ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. మండలాలు, గ్రామాల్లో బ్లాక్ ప్లాంటేషన్, యాదాద్రి మోడల్, ఫ్లలెప్రకృతి వనం, ఫెన్సింగ్ ఖచ్చితంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎవరికి వారు దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి కరీంనగర్ జిల్లాలో విరివిగా మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు వనాలను ఆస్తిగా అందించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వనాలను పెంచి మన భవిష్యత్తు తరాలకు ఆస్తిగా అందించాలని తెలిపారు. హరితహారంలో భాగంగా ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కల పంపిణీని ఇటీవల మేయర్ సునీల్ రావు ప్రారంభించారు. మహిళలు కోరుకున్న పూల, పండ్ల మొక్కలను ఇంటింటికీ అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటుతామన్నారు. పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటికీ అందించే ఆరు మొక్కలను యజమానులు నాటి సంరక్షించాలని కోరారు. నగరంలోని అన్ని వీధుల్లోనూ అధిక సంఖ్యలో మొక్కలు నాటి పచ్చని నగరంగా మార్చాలన్నారు.

## జిల్లాలో పెరుగుతున్న కరోనా కేసులు

### ఆందోళనలో సామాన్య ప్రజలు

మంచిర్యాల,జూలై20(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా మహమ్మారి కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతు న్నారు. ఎప్పుడు ఎక్కడ పాజిటివ్ కేసు వస్తోందో అన్న భయంలో ప్రజలు ఉన్నారు. జిల్లాలో ఇప్పటికే పాజిటివ్ కేసుల సంఖ్య 262కు చేరింది. జిల్లాలో ఇప్పటికే మొత్తం నాలుగు మరణాలు నమోదయ్యాయి. చెన్నూర్‌లో ఒక పోలీసు అధికారికి కూడా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. మంచిర్యాలలో ఇప్పటికే 60కి పైగా, బెల్లంపల్లిలో 70 వరకు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బెల్లంపల్లి, మంచిర్యాల, నస్పూర్, మందమర్రి మండ లాలలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకు పెరుగుతూ ఉన్నాయి. నస్పూర్‌కు చెందిన మహిళ (25) కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూమృతి చెందింది. అప్రమత్తంగా ఉం డాలని, ప్రభుత్వ సూచనలను కచ్చితంగా పాటించాల ని అధికారుల పేర్కొన్నారు. శ్రీరాంపూర్ కృష్ణా కాలనీలో ఒకరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా అతనికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు సమాచారం. వెంటనే అతన్ని వైద్యాధికారులు బెల్లంపల్లి ఐసోలేషన్ కేంద్రానికి పంపించారు. చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మరో పోలీస్ అధికారికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ప్రజలతో పాటు, పోలీసులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం బ్లూకోట్ కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్ రావడంతో అతనితో కుటుంబ సభ్యులను హోం క్వారంటైన్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలో కరోనా వైరస్ కోరలు చాస్తోంది. పట్టణంలో శనివారం కేసుల సంఖ్య 47కు పెరిగింది. కుమ్రరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఖైరి గూడా ఓపెన్ కాస్టులో పని చేస్తున్న కార్మికుల్లో ఏడు గురికి పాజిటివ్ రాగా వారంతా బెల్లంపల్లి పట్టణానికి చెందిన వారుగా నిర్ధారించారు. తాజాగా మహ్మద్ ఖాసీం బస్తీకి చెందిన ఓ మహిళకు పాజిటివ్ వచ్చింది. ఖైరి గూడా ఓపెన్ కాస్టులో పని చేస్తూ పాజిటివ్ వచ్చిన ఏడుగురు కార్మికులు హనుమాన్ బస్తీ, స్టేషన్ రోడ్డు కాలనీ, గోల్ బంగ్లా బస్తీలకు చెందిన వారుగా గుర్తించి చర్యలు తీసుకున్నారు. ధర్మారావుపేటకు చెందిన చెందిన కరోనా పాజిటివ్ ఉన్న బంధువులను చూడడానికి వెళ్లిన నేపథ్యంలో ఆమెకు పాజిటివ్ వచ్చిందని వైద్య సిబ్బంది తెలిపారు. లక్సెట్టిపేట పట్టణా నికి చెందిన మహిళా ఉద్యోగికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఉద్యోగి ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ప్రభుత్వ శాఖలో కీలకమైన బాధ్యతలను చేపడుతోందది. దీంతోలక్షెట్టిపేటలో ఉంటున్న ఆమె భర్త, కుమార్తెను ప్రైమరీ కాంటాక్ట్ కింద హోం క్వారంటైన్ చేశారు. శెట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవ ర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆటో డ్రైవర్‌ను బెల్లంపల్లి ఐసోలేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు రావద్దని సూచించారు.

## మెదక్ పట్టణానికి ఇక భగరీథ నీళ్లు

### ట్రయల్ రన్ కోసం కసరత్తు
### –మంత్రి ఆదేశాలతో వేగంగా పనులు

మెదక్,జూలై20(ఆర్ఎన్ఎ): మెదక్ పట్టణంలో ఆగస్టు 15లోగా ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలని, ఇందుకోసం ఈ నెల 22 వరకు ట్రయల్ రన్ పూర్తిచేయనున్నారు. నీటి సరఫరా ప్రారంభోత్సవానికి సీఎంకేసీఆర్ హాజరయ్యే అవకాశముందని మంత్రి హరీష్ రావు స్వయంగా వెల్లడించారు. దీంతో అధికారులు ఆ మేరకు పనుల్లో నిమగ్నం అయ్యారు. మున్సిపల్ చైర్మన్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని మంత్రి హరీస్ రావు నిర్దేశించారు. నిధుల కోసం ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. మున్సిపాలిటీ లకు ప్రధాన ఆదాయ వనరులైన దుకాణాల అద్దె వసూలుపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలన్నారు. పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. మున్సిపాలిటీల్లో ఆదాయ వనరులను పెంచుకోవడంపై చైర్మన్లు, కమిషనర్‌లు దృష్టిసారించాలని పలు సందర్భాల్లో సూచించారు. సొంతంగా ఆదాయ వనరులను పెంచుకుంటే నిధుల కోసం ప్రభుత్వం వైపు సూచే అవకాశం రాదన్నారు. మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల కమిషనర్లు, చైర్మన్లతో ఇటీవల సమీక్షా సమావేశం సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహనకల్పించాలని సూచించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో షీ–టాయిలెట్స్ నిర్మించడానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. పదివేల మందికో టాయిలెట్ చొప్పున ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇందుకోసం స్థల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలన్నారు. తుప్పు పట్టిన ఇనుప స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీనెల కరెంటు బిల్లులను తప్పకుండా చెల్లించాలని, విద్యుత్ పొదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని, బోర్లకు కెపాసిటర్లు వినియోగించాలని, వాడుకలో లేని బోర్ల కనెక్షన్లు తొలగించాలని సూచించారు. నాలుగు మున్సిపాలిటీల్లో నీటి సరఫరాకు ఎన్ని ట్యాంకర్‌లను వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి జరిమానాలు విధించాలన్నారు. త్వరలో తెల్ల రేషన్‌కార్డుదారులకు రూపాయికే నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. మున్సిపాలిటీల్లో ఎక్కువ నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.ం

## ప్రైవేటు రైళ్లను ప్రారంభించే సమయంపై స్పష్టీకరణ

హైదరాబాద్, జులై 20:దేశంలో ప్రైవేటు రైళ్ల ప్రారంభ సమయాలపై కొన్ని పత్రికల్లో వార్తలు ప్రచురించారు. 2024 మార్చిలో ప్రైవేటు రైళ్ల ప్రాజెక్టు ప్రారంభమవుతుందని ఆ వార్తల్లో ప్రస్తావించారు. దీనిపై శనివారం (జులై 18, 2020) మీడియాలో స్పష్టత ఇచ్చాం, దానినే ఇప్పుడు కూడా పునరావృతం చేస్తున్నాం. 2023 మార్చి నుంచి మాత్రమే ప్రైవేటు రైళ్లు నడుస్తాయని గమనించాలి. 2021 మార్చి నాటికి టెండర్లు ఖరారవుతాయి, 2023 మార్చి నుంచి రైళ్లు నడుస్తాయి.

గత కారణాల వల్ల ఏదైనా అపనమ్మకం తలెత్తితే, పైన పేర్కొన్న విషయాలను వాస్తవ ప్రకటనగా తీసుకోవచ్చు.

# కరోనా రక్షణకు మాస్కులు తప్పనిసరి

### జిల్లాలో 70 కరోనా పాజిటివ్ కేసులు

### అధికారులతో సమీక్షలో కలెక్టర్ పలు సూచనలు

కుమ్రంభీం ఆసిఫాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరువు పరిస్థితిపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కరువు సమస్యలపై అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కరోనా ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలరో అవగాహన కల్పించాలన్నారు. మాస్కులు తప్పనిసరిగా ధరించేలా చూడాలన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు 70 కరోనా పాజిటివ్ కేసులు వచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో, కాగజ్ గర్, రెబ్బెన, సిర్పూర్ టి లలో కొత్తగా క్వారంటైన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలోకి వలస కూలీలు 1828 మంది, రైళ్ల ద్వారా 1487 మంది వచ్చారన్నారు. అందులో 897 మంది నుంచి శాంపిళ్లను సేకరించి టెస్టులకు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వాంకిడి ఐసోలేషన్ కేంద్రంలో 12, గోలేటిలోని క్వారంటైన్‌లో 19 మందికి చికిత్స అందిస్తున్నారన్నారు. అందులో 26 మంది కోలుకుని ఇళ్లకు వెళ్లారని, ఐదుగురు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఆసిఫాబాద్‌లోని న్యూ రాజంపేట్, పైకాజీనగర్, కాగజ్‌నగర్‌లోని ఓల్డ్ కాలనీ, టీచర్స్ కాలనీ, బెజ్జూర్, ఈస్గాం, 11వ, 12వ నంబర్ గ్రామాల్లో హెల్త్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 60-70 ఏళ్ల దాటి మధుమేహం, రక్తపోటు, తలసేమియా, హెచ్ఐవీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న ఒక్కొక్కరికీ 2 మాస్కుల చొప్పున ఇవ్వాలన్నది ప్రభుత్వ ఆదేశమన్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సెల్ఫ్, హెల్ప్ గ్రూపుల ద్వారా మాస్కులు తయారు చేసి సరఫరా చేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వైద్యాధికారి కుమ్రం బాలు, జిల్లా రెవెన్యూ అధికారి కదం సురేష్ తదితరులున్నారు.

# తిరుమలలో కరోనా కలకలం

### మాజీ ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు మృతి

### డాలర్ శేషాద్రికి కరోనా అంటూ వచ్చిన వార్తలపై ఫిర్యాదు

తిరుమల,జూలై20(ఆర్ఎన్ఎ): శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు శ్రీనివాసమూర్తి దీక్షితులు(75) సోమవారం ఉదయం మృతి చెందారు. పది రోజుల క్రితం శ్రీనివాసమూర్తికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ఆయనను తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్విమ్స్ లో చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం శ్రీనివాస మూర్తి మృతి చెందారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకునిగా శ్రీనివాసమూర్తి దీక్షితులు 20 సంవత్సరాల పాటు కొనసాగారు. 2018వరకు ప్రధాన అర్చకుల హోదాలో శ్రీవారి కైంకర్యాలు నిర్వహించిన శ్రీనివాసమూర్తి దీక్షితులు, పెద్దింటి వంశపర్యంపర్య అర్చకులుగా టిటిడి అధికారులు తెలిపారు. ఇదిలావుంటే తిరుమలలో రోజుకో వివాదం రాజుకుంటూనే ఉంది.. తాజాగా డాలర్ శేషాద్రికి కరోనా పాజిటివ్ అంటూ ఎస్వీ బద్రి చేసిన ట్వీట్లు కలకలం రేపుతున్నాయి. దీంతో.. తనను మానసికంగా వేధిస్తున్నారంటూ బద్రిపై టీటీడీకి డాలర్ శేషాద్రి ఫిర్యాదు చేశారు. కాగా, డాలర్ శేషాద్రి ఆరోగ్యం బాగోలేదని.. ప్రతీ రెండు నెలలకు ఒకసారి ఆయన పరీక్షలు చేయించుకుంటున్నారని.. అపోలో ఆస్పత్రిలో పరీక్షలు చేశారంటూ ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు అనుచరుడు ఎస్వీ బద్రీ ట్వీట్ చేశారు.. పైగా ఆయనకు కరోనావైరస్ పాజిటివ్ అంటూ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.. దీనిని తీవ్రంగా పరిగణించిన డాలర్ శేషాద్రి.. టీటీడీకి ఫిర్యాదు చేశారు.. తనను మానసికంగా వేధించడంతో పాటు.. భక్తులను భయబ్రాంతులకు గురిచేస్తున్న బద్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. శేషాద్రి ఫిర్యాదును స్వీకరించిన టీటీడీ.. బద్రిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.

# గోవధలు, అక్రమ రవాణా నియంత్రణకు పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.బి. కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, జులై 20 (నేటినిజం ప్రతినిధి):గోవధలు, గోవుల అక్రమరవాణా నియంత్రణ, విక్రయాలపై కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా పటిష్ట చర్యలు తీసుకున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. గోవుల అక్రమరవాణా నియంత్రణ పేరిట ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

బక్రీద్ వేడులను నిరాఢంబరంగా ఇళ్ళలోనే జరుపుకునేవిధంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ముస్లింలతోపాటు ఇతరమతాలకు చెందిన పెద్దలు, ఆయా మతాలకు చెందిన ప్రతినిధులతో వివిధ స్థాయిల్లో పోలీసులు ప్రతివాడల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ముస్లిం మతపెద్దలు ప్రస్తుతం నెలకుని ఉన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో నిరాఢంబరంగా, ఇళ్ళలోనే వేడుకలను జరుపుకుంటామని హామీఇస్తున్నారని పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా నియంత్రణల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ లోకి ప్రవేశించే అన్ని రహదారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు షిఫ్టుల పద్దతిలో రేయింబవళ్ళు తనిఖీలను కొనసాగిస్తారని చెప్పారు.

**ప్రతి గ్రామపంచాయతి/మున్సిపాలిటీ కేంద్రాల వద్దనుండి అవగాహన**

బక్రీద్ వేడుక పూర్తయ్యేంతవరకు కమిషనరేట్‌లోని ప్రతిగ్రామపంచాయతి/మున్సిపాలిటీ కేంద్రాల వద్ద ఉన్న మైకుల ద్వారా అవగాహన కల్పించే పక్రియ ఆదివారంనాడు ఉదయం నుండి ప్రారంభమైందని, ఈ వేడుక ముగిసేంతవరకు పైన పేర్కొన్న కేంద్రాలతోపాటు పోలీసులు పబ్లిక్ అడ్రస్‌సిస్టమ్‌ద్వారా వాహనాల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారని తెలిపారు. గోవుల విక్రయాలు, వధలపై గ్రామాల్లో దప్పులవాయింపులతో అవగాహన/ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను కోరామని, ఇందుకు వారందరూ తమవంతు సహకారం అందించేందుకు ముందుకువచ్చారని చెప్పారు.

**సంతల్లో గోవుల విక్రయాల నియంత్రణకు చర్యలు**

ప్రతివారం కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంత(అంగట్లు)ల్లో గోవుల క్రయ,విక్రయాలు జరుగకుండా పోలీస్‌శాఖ తరపున చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆయాప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు ప్రత్యక్ష్యంగా సంతలను పరిశీలిస్తారని చెప్పారు. ప్రతివారం వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేకదృష్టి సారించడం జరిగిందని తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడూ సమీక్షించేందుకు కమిషనరేట్ కేంద్రంలో ప్రత్యేకవిభాగాన్ని ఏర్పాటు చేసామని చెప్పారు.

**అక్రమ రవాణా, విక్రయాలపై ఎలాంటి నమాచారం ఉన్నా తెలియజేయాలి**

పశువుల అక్రమరవాణా, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సంబంధిత పోలీసు అధికారులు లేదా డయల్ 100లకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కోరారు. పోలీస్‌శాఖ ఇన్నిరకాల పటిష్టచర్యలు తీసుకున్నా కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యల్లో భాగంగా వారికున్న అనుమానాలతో వాహనాలు ఆపి తనిఖీలు చేయడం, మతాలమధ్య అల్లర్లు సృష్టించేందుకు కారకులయ్యేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మతాలకు సంబంధించిన అంశం చాలాసున్నితమైందనే విషయాన్ని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు గుర్తించాలని చెప్పారు. మతసామరస్యాన్ని పరిరక్షించేచర్యల్లో అన్నిమతాలు, వర్గాలకు చెందిన ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు.

# చేర్యాల డివిజన్ కోసం జెఏసి ఆందోళనలు

### ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్

### మద్దతుగా నిలిచిన అధికార, విపక్ష పార్టీల నేతలు

సిద్దిపేట,జూలై20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్నచేర్యాలా రెవెన్యూ డివిజన్ కోసం స్థానిక ప్రజలు పోరాటానికి దిగారు. మంత్రి హరీష్ రావు జిల్లాలకు చెందిన వాడే అయినా తమ సమస్యపై ఎందుకు పట్టించుకోరని అంటున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న చేర్యాల నియోజకవర్గంగా ఉండేది. జనగామ జిల్లా ఏర్పడద్దప్పటికీ దానిని అందులో కలపకుండా స్థానికులు సిద్దిపేటలో కలిశారు. సంగారెడ్డి జిల్లాలో, సిరిసిల్ల జిల్లాలో ఇటీవల రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో చేర్యాల పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలన్న దశాబ్దాల ఆకాంక్ష మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతీసారి ఎన్నికల హామీగానే మిగిలిపోతున్నా తాజా పరిణామాలతో ఒకింత ఆశలు చిగురిస్తున్నాయి.

తాజాగా సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడను రెవెన్యూ డివిజన్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో చేర్యాల విషయంలోనూ కీలక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలనే వాదనలు మిన్నంటాయి. రెవెన్యూ డివిజన్ సాధన సమితి జేఏసీ నేతలు ఇటీవల కరోనాను లెక్క చేయకుండా రోడ్డెక్కడి ఆందోళన బాటపట్టారు.

చేర్యాల పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలన్న దశాబ్దాల ఆకాంక్ష మళ్లీ తెరపైకిమద్దూరు మండలంలో ఉన్న ధూలిమిట్ట గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. మద్దూరు మండలంలో 23 గ్రామాలుండగా 13 గ్రామాలతో ధూలిమిట్ట కొత్త మండలంగా ప్రకటించనున్నారనే చర్చ జరుగుతోంది. మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి, ధూలిమిట్ట నాలుగు మండలాలతో కలిసి చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయనున్నారనే ప్రచారం ఇటీవల ఎక్కువగా జరుగుతోంది. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నేతలు అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అయ్యే అన్ని అర్హతలున్నా పట్టించుకోవడం లేదన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లోని అన్ని గ్రామపంచాయతీలు తీర్మానం చేసి ప్రభుత్వానికి అందించడంతో పాటు ఏడాదిన్నర కాలంగా అన్నివర్గాలు ఆందోళన చేస్తున్నా గుర్తించకుండా అన్యాయం చేస్తున్నారని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో చేర్యాలను విచ్ఛిన్నం చేశారు.

ఒక్కో ప్రభుత్వశాఖ పనులకు గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ డివిజన్‌కు, కోర్టుకు జనగామకు పోవాల్సి వస్తుండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాల మండలాన్ని జనగామ నియోజకవర్గంలో విలీనం చేశారు. దీంతో కొంత ఉనికి కోల్పోయింది. జిల్లాల విభజన సమయంలో ఈప్రాంతం సిద్దిపేట జిల్లాలో కలిసింది. ఇటీవల మున్సిపాలిటీ హోదా కూడా దక్కింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తావన రాగానే చేర్యాల పేరు ప్రథమంగా వినిపిస్తుంది. అర్హతలు ఉన్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేయాలనే ఆకాంక్ష బలంగా నాటుకుంది. ఇదే విషయం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిలోనూ ఉన్నట్లుగా పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఊరిస్తూ వచ్చారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సైతం గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల దీక్ష చేపట్టారు. ఈ పరిణామాలతో పాటు కొత్త డివిజన్లను ఏర్పాటు చేస్తుండడంతో మరొక్కసారి ప్రజాప్రతినిధులంతా చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లాల విభజన సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాలు సిద్దిపేటలో విలీనమయ్యాయి. ఈ మూడు మండలాల పోలీసుశాఖను హుస్నాబాద్ డివిజన్‌కు అప్పగించారు. చేర్యాల, కొమురవెల్లి రెవెన్యూ విభాగాలను సిద్దిపేట డివిజన్‌కు, మద్దూరు మండలాన్ని హుస్నాబాద్‌కు కేటాయించారు. ఇక వ్యవసాయశాఖ పరంగా చూస్తే మూడు మండలాలను గజ్వేల్ డివిజన్‌కు విభజించారు. విద్యుత్ యంత్రాంగం కూడా హుస్నాబాద్ డివిజన్ కేంద్రంగానే నడుస్తోంది. ఇక మూడు మండలాల న్యాయవ్యవస్థ జనగామ పరిధిలో ఉంది. ఇలా ఒక్కో శాఖ ఒక్కో డివిజన్‌కు అప్పగించడంతో గందరగోళంగా ఉంది. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైతేనే అన్ని శాఖలు ఒకేచోట ఉంటాయనే వాదన వినిపిస్తోంది.

# సచివాలయ కూల్చివేతపై ఎన్జీటి విచారణ

### కూల్చివేత వ్యర్థాల నిర్వహణపై కమిటీ

### రేవంత్ కేసుపై విచారణ సెప్టెంబర్25కు వాయిదా

హైదరాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర సచివాలయం కూల్చివేతపై జోక్యం చేసుకోలేమని జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) చెన్నై బెంచ్ స్పష్టం చేసింది. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా సచివాలయం కూల్చివేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఎన్‌జీటీ సోమవారం విచారించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఎన్‌జీటీ.. సచివాలయం కూల్చివేత అంశం జోలికి వెళ్లబోమని స్పష్టం చేసింది. ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందుకు కూల్చివేత జోలికి వెళ్లలేమని ఎన్‌జీటీ తేల్చిచెప్పింది. ఈ విషయమై ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ ఎన్‌జీటీ ఉత్తర్వులిచ్చింది. కూల్చివేతతో పర్యావరణ కాలుష్యం, వ్యర్థాల నిర్వహణపై అధ్యయనానికి కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర పర్యావరణ శాఖ, సీపీసీబీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. సచివాలయం భవనాల కూల్చివేతకు హైకోర్టు నుంచి అనుమతి లభించిన విషయం విదితమే. భవనాల కూల్చివేతను నిలిపివేయాలని దాఖలైన పిటిషన్ ను ఈ నెల 17వ తేదీన కోర్టు కొట్టేసింది. భవనాల కూల్చివేతకు పర్యావరణ శాఖ అనుమతి అవసరం లేదని కోర్టు తేల్చిచెప్పింది. రాష్ట్ర మంత్రి వర్గ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది.భవనాల కూల్చివేతకు పర్యావరణ అనుమతి అవసరం లేదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) కూడా గతంలోనే హైకోర్టుకు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం నోటీఫై చేసిన 'నిర్మాణం- కూల్చివేత నిబంధనలు-2016'ను పాటిస్తే సరిపోతుందని పేర్కొన్నాయి.

కూల్చివేత వల్ల పర్యావరణ ప్రభావం, వ్యర్థాల నిర్వహణ పై అధ్యయనానికి కమిటీని నియమించింది. విచారణ జరిపి రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ఎన్జీటీ ఆదేశించింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఐఐటీ హైదరాబాద్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలతో కమిటీకి ఎన్జీటి ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎన్జీటీ ఆదేశిస్తూ...తదుపరి విచారణకు సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది.

# కరోనా మీద పోరులో ప్రసార మాధ్యమాల పాత్ర భేష్! - ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, జులై 20:కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రజలకు సరైన, అవసరమైన సమాచారాన్ని చేరవేస్తూ అనుక్షణం వారిని అప్రమత్తం చేయడంలో ప్రసారమాధ్యమాలు పోషించిన నిర్మాణాత్మక పాత్రను ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసించారు. 'కరోనాపై పోరులో ప్రసార మాధ్యమాల అసమాన పాత్ర' పేరుతో ఆదివారం ఫేస్‌బుక్ వేదికగా విడుదల చేసిన వ్యాసంలో.. గతకొద్ది నెలలుగా వైరస్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పరచడంలో.. జాగ్రత్తగా ఉండేందుకు ప్రభుత్వాలు చేసిన సూచనలు నిరంతరం ప్రజలకు చేరవేయడంలో మీడియా పోషించిన పాత్రను అభినందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభంగా తన విధులను మీడియా సమర్థవంతంగా నిర్వహించి డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులతోపాటు కరోనాపై పోరాటంలో సైన్యంతో సమానంగా ముందువరసలో నిలిచిందన్నారు.

'విపత్తులు తలెత్తినపుడు ప్రజలు సరైన సమాచారం, దాని ప్రభావం తదితర అంశాలను తెలుసుకునేందుకు మీడియాపై ఆధారపడతారు. ప్రభుత్వాలు చేసే సూచనలతో సమస్యలనుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తారు' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ.. వైరస్ విస్తృతి, కరోనాపై పోరాటానికి అవసరమైన సన్నద్ధత, సమాజం పోషించాల్సిన బాధ్యత తదితర అంశాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ.. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజల్లో మనోధైర్యం కలిగించి ఆందోళన తగ్గించడంలో మీడియా అసమానపాత్ర పోషించిందన్నారు. దీంతోపాటుగా పార్లమెంటరీ వ్యవస్థలో.. కరోనా, సమాజంలోని వివిధ వర్గాలపై దీని ప్రభావం తదితర అంశాలపై చర్చ జరిగేలా అజెండాను కూడా మీడియా సూచించిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

మాస్కులు ధరించడం, సామాజిక, సురక్షిత దూరాన్ని పాటించడం, తరచుగా చేతులు కడుక్కోవడం, ఆరోగ్యకరమైన భోజనం, మానసిక ఒత్తిడినుంచి బయటపడేందుకు అవసరమైన శారీరక వ్యాయామం, ఆధ్యాత్మికత ఆవశ్యకత తదితర అంశాలను ప్రచారం చేయడంలో మీడియా పాత్రను ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ విషయాన్ని మీడియా విద్యుక్త ధర్మంగా తలకెత్తుకుని ప్రజల్లో ఆందోళన తగ్గించడంలో కీలక భూమిక పోషించిందన్నారు.

'ఆంక్షల కారణంగా ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడం వంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కొన్ని సంస్థలు ఆర్థిక భారాన్ని భరించలేక జర్నలిస్టుల వేతనాల్లో కోత విధించాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రసారమాధ్యమాలు, జర్నలిస్టులు ప్రజలను చైతన్యపరచడంలో తమ బాధ్యతను విస్మరించక వృత్తి ధర్మానికి కట్టుబడ్డారు. వారి చొరవను, సంకల్ప స్ఫూర్తిని అభినందిస్తున్నాను' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రజలను కరోనాపై అప్రమత్తం చేసే ప్రక్రియలో చాలా మంది విలేకరులు కరోనా బారిన పడగా, కొందరు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కర్తవ్యనిష్ఠకు కట్టుబడి ప్రాణాలు కోల్పోయిన మీడియా సిబ్బందికి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పత్రికలు వైరస్ వాహకాలంటూ జరిగిన ప్రచారంతో కొన్ని పత్రికల పంపిణీలో గణనీయమైనమార్పులు వచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. 'పత్రికలు వైరస్ వాహకాలని మొదట్లో ప్రచారం జరిగింది. ఈవిషయంలో కొంత స్పష్టత వచ్చిన తర్వాత పంపిణీ తిరిగి కొనసాగింది. అయితే ఇప్పటికీ కొంత మంది పాఠకులు వీటిని తీసుకోవటానికి సందేహిస్తున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. పత్రికలు వైరస్ వాహకాలు కాదు. నేను రోజూ పత్రికలు చదువుతూనే ఉన్నాను' అని ఆయన వెల్లడించారు.సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు కేవలం అధికారిక, ధృవీకృత సమాచారాన్ని మాత్రమే వెల్లడించాలని.. లేని పక్షంలో అనవసర అపోహలతో ప్రజల్లో ఆందోళన నెలకొనే ప్రమాదముందని ఉపరాష్ట్రపతి సూచించారు.

వలస కార్మికులు, పేదలు వంటి బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై టెలివిజన్ ఛానళ్ళు అందించిన క్షేత్ర స్థాయి నివేదికలు (గ్రౌండ్ రిపోర్ట్) ఇప్పటికీ సమాజంలో ఉన్న అసమానతల స్థాయిని ఎంతో హృద్యంగా వివరించాయన్నారు. మహమ్మారికి సంబంధించిన వివిధ అంశాలను లేవనెత్తడం ద్వారా, వాస్తవిక, విశ్లేషణాత్మక పద్ధతిలో ప్రచురించడం ద్వారా ఈ మహమ్మారి నేపథ్యంలో పార్లమెంటరీ సంస్థల చర్చల విషయంలో మీడియా ఒక అజెండాను సూచించిందన్నారు. 'ఈ విషయంలో మేము ముందుకు సాగటంలో, సంబంధిత సమస్యలను లేవనెత్తే విషయంలో మీడియా నివేదికలు సూత్రప్రాయమైన సూచనలుగా ఉపయోగపడ్డాయి' అని ఉపరాష్ట్రపతి వెల్లడించారు.

# కరోనాతో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ సందీప్ కుమార్




.కుమ్రంభీమ్ జిల్లాలో కరోనా వ్యాప్తిపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ సంతీప్ కుమార్ ఝా

కుమ్రం భీం ఆసిఫాబాద్ , జులై 20: జిల్లాలో కరోనా పరిస్థితిపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమస్యలపై అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కరోనా ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మాస్కులు తప్పనిసరిగా ధరించేలా చూడాలన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు 70 కరోనా పాజిటివ్ కేసులు వచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో, కాగజ్ గర్, రెబ్బెన, సిర్పూర్ టి లలో కొత్తగా క్వారంటైన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వైద్యాధికారి కుమ్రం బాలు, జిల్లా రెవెన్యూ అధికారి కదం సురేష్ తదితరులున్నారు

# మంత్రి పదవులపై మనసుపడ్డ ఆ ఇద్దరు

### జిల్లాలో ఇప్పటికే ఇద్దరికి బెర్తులు

### మరొకరికి చాన్స్ వస్తుందా అన్న అనుమానాలు

విజయనగరం,జూలై20(ఆర్ఎన్ఎ): పార్లమెంట్ నియోజకవర్గాలను జిల్లాలు చేస్తారనే ప్రచారం మధ్య ఏజెన్సీలో ఎవరికి వారు తమ ప్రాంతాలను జిల్లాలు చేయించాలని కోరుతున్నారు. దీనికితోడు రెండు మంత్రి పదవులు ఖాళీ కావడంతో వాటిపైనా కొందరు మనసు పారేసుకున్నారు. వైకాపాలో కీలక నేతగా ఉన్న రాజన్నదొరకు ఈసారి తప్పకుండా జగన్ నుంచి పిలుపు వస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నారని ప్రచారం సాగుతోంది. కొలగట్ల సైతం ఇలాంటి లెక్కల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది . అయితే సామాజిక సమీకరణాల వల్ల రాజన్నదొర, కొలగట్లకు ఛాన్స్ ఉంటుందా అన్న అనుమానాలను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.. రెండేళ్ల తర్వాత ఎలాగూ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సీఎం జగన్ గతంలోనే స్పష్టం చేయడంతో.. అప్పుడే అదృష్టం కలిసి రావొచ్చని భావిస్తున్నారు. అయితే వీరు ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధినేతకు అండగా ఉంటూ వచ్చారు. ఇప్పుడు పవర్‌లోకి రావడంతో కేబినెట్ బెర్త్ దక్కుతుందని ఆశించారు. ఆ ఛాన్స్ దక్కకపోయినా.. తమ నెంబర్ వస్తుందని నమ్మకంతో ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచిన జిల్లాలో విజయనగరం జిల్లా ఒకటి. తొమ్మిదికి తొమ్మిది స్థానాలను వైకాపా క్లీన్ స్వీప్ చేసింది. ఆ మేరకు కేబినెట్ బెర్త్ లు వస్తాయని జిల్లా వాసులు అనుకున్నట్లే డిప్యూటీ సీఎంతోపాటు కీలకమైన మున్సిపల్ శాఖని సైతం జిల్లాకే కట్టబెట్టారు. మంత్రివర్గంలో బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి చోటు సంపాదించారు. జిల్లాకు కీలక పదవులు రావడం వరకూ బాగానే ఉన్నా.. ముగ్గురు సీనియర్లకు మాత్రం మొండి చెయ్యే మిగిలింది. కొలగట్ల వీరభద్ర స్వామి, రాజన్నదొర, బొబ్బిలి రాజులను ఓడించిన శంభంగి వెంకట చిన అప్పలనాయుడు మంత్రి పదవి ఆశించారు. జిల్లా నేతలు కూడా ఈ ముగ్గురిలో ఒకరికి కేబినెట్ బెర్త్ ఖాయమనుకున్నారు. అప్పుడు ఎలాగో రాలేదు.. తాజాగా ఇద్దరు మంత్రులు రాజ్యసభకు వెళ్లడంతో ఈ దఫా అయినా ఛాన్స్ లభిస్తుందని మళ్లీ ప్రచారం మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో పార్టీ మారాలని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకుని నిలబడ్డామని.. ఇప్పుడు తప్పకుండా తమను పరిగణనలోకి తీసుకుంటారని వీరు ఆశిస్తున్నారు. అయితే ఇప్పటికే రెండు మంత్రి పదుఉల ఇచ్చినందున మరొకరికి ఛాన్స్ లేదని పార్టీలో ఓ వర్గం ప్రచారం చేస్తోంది.

తత

# పితాని రాజకీయ వ్యూహంపై సర్వత్రా ఆసక్తి

### బిసిలను ఏకం చేసే పనిలో ఉన్నారని చర్చ

### అరెస్ట్ చేస్తే ఏం చేయాలనేదానిపై నేతలతో మంతనాలు?

ఏలూరు,జూలై20(ఆర్ఎన్ఎ): ఇఎస్ఐ స్కామ్‌లో మాజీమంత్రి అచ్చెన్న ఇప్పటికే అరెస్ట్ కాగా మరికొందరి నేతలకూ ఇది చుట్టుకుంటోంది. మాజీమంత్రి పితాని సత్యనారాయణ, ఆయన తనయుడికి కూడా ఉచ్చు బిగుస్తోంది. ఈ స్కామ్‌లో ఇప్పటికే మాజీ మంత్రి అచ్చెన్నాయుడు అరెస్టయి జైలులో ఉన్నారు. మరికొందరు అధికారులు సైతం ఊచలు లెక్క పెడుతున్నారు. ఈ కేసులో మరో మంత్రి పితాని సత్యనారాయణ పాత్రపై రకరకాలుగా ప్రచారం జరుగుతున్నా.. ఆయన్ని అరెస్ట్ చేస్తారా లేదా అన్నదానిపై ఉత్కంఠంగా మారింది. కాకపోతే పితాని మంత్రిగా ఉన్నప్పుడు ఆయన దగ్గర పనిచేసిన మురళీని అధికారులు అరెస్ట్ చేయడంతో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ పెరిగిపోతోంది. పితాని కుమారుడు సురేష్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడం కూడా ఈ ఎపిసోడ్ మరింత ఆసక్తిగా మారింది.

పితాని కుమారుడు సురేష్ అప్పట్లో మందుల సరఫరా కాంట్రాక్ట్ దక్కించుకోవడంతో దర్యాప్తు అధికారులు అటు దృష్టి పెట్టారు. తనయుడికి కాంట్రాక్ట్ దక్కడంలో మాజీ మంత్రి సాయం చేశారని గుర్తిస్తే పితాని అరెస్ట్ ఖాయమనే ప్రచారం ఊపందుకుంది. అందుకే ఈ అరెస్టల వ్యవహారం తన కుమారుడిని దాటి తన వరకూ వస్తుందేమోనన్న అనుమానంతో పితాని ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారని సమాచారం. అందుకు అనుగుణంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని తన బలగాన్ని సిద్ధం చేస్తున్నారని ప్రచారం సాగుతోందిపితాని గతంలో వైఎస్ కేబినెట్‌లో పనిచేశారు. విభజన తరవాత టీడీపీలో చేరి చంద్రబాబు మంత్రివర్గంలో చోటు సంపాదించారు. ఆ అనుభవంతో ఈ కేసులో నుంచి ఎలా బయటపడాలా అని జిల్లాలోని బీసీ నాయకులందరినీ సమీకరిస్తున్నట్లు సమాచారం.అందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. బీసీ ముఖ్యనాయకులను పిలిచి తన ఇంట్లో మంతనాలు జరుపుతున్నట్లు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా బీసీ నాయకులు పితాని ఇంటికి వస్తుండటంతో దీనికి బలం చేకూరుతోంది. మరోవైపు కేవలం టీడీపీ నాయకులపై కక్ష తీర్చుకోవడానికే ఈ అరెస్టులు చేస్తున్నారని.. పితానిని ఏమీ చేయలేక.. ఆయన కుమారుడిని టార్గెట్ చేశారని బిసి నేతలు మెల్లగా గళం విప్పుతున్నారు. కుమారుడిపై గురిపెడితే పితాని దారిలోకి వస్తారన్నది అధికార పార్టీ వ్యూహంగా ఉందని కూడా ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరవాత పితాని సత్యానారాయణ కూడా జగన్ పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. ఇప్పుడు ఇఎస్ఐ కేసు తెరపైకి రావడంతో.. మరోసారి వైకాపాలోకి వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం మొదలైంది. భారీ మందీమార్బలంతో వెళ్లే తప్ప వైసీపీ చేర్చుకునే పరిస్థితి లేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. పైగా టీడీపీకి భారీ నష్టం జరుగుతుందని భావిస్తేనే జఅఖలోకి ఆహ్వానిస్తున్నారట. అందుకే పితాని జిల్లాలోని బీసీ నాయకులను అందరినీ కలుపుకొని పార్టీ మారే ప్రతిపాదనను వైకాపా ముందు పెట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు అధికార పార్టీ ఓకే అంటే సరే. లేదంటే అరెస్ట్ సమయంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి తన సామాజికవర్గంలో సానుభూతి పొందాలనే వ్యూహానికీ పితాని పదును పెడుతున్నట్లు సమాచారం. మొత్తంగా ఇప్పుడు పితాని వ్యవహారం పశ్చిమలో చర్చనీయాంశంగా మారింది.

# ఈనెల 31 వరకు లాక్ డౌన్

ఏలూరు,జూలై20(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో పరిస్థితులను బట్టి ఆంక్షలు విధిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక కేసులు నమోదవుతున్న జిల్లాల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటి. ఈ జిల్లాలో లాక్‌డౌన్ ను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధం అయ్యింది. నేటి నుంచి జులై 31 వ తేదీ వరకు జిల్లాలోని ఏలూరు, తాడేపల్లి గూడెం, పాలకొల్లు, భీమవరం, నరసాపురం, కొవ్వూరులో లాక్ డౌన్ అమలు చేయబోతున్నారు. లాక్ డౌన్ అమలు జరిగినన్ని రోజులు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు నిత్యవసర వస్తువుల దుకాణాలు తెరిచి ఉంటాయి. ఉదయం 11 గంటల తరువాత షాపులు మూసేస్తారు. ఉదయం 11 తరువాత ఎవరూ కూడా రోడ్లమీదకు రాకూడదని పోలీసులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

# ఉమ్మడి జిల్లాలో ఆగని కేసుల సంఖ్య

నిజామాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలో కరోనా విజృంభిస్తున్నది. కామారెడ్డి పట్టణంలో 19, బాన్సువాడలో ఏడు, మద్నూర్‌లో ఒకటి, పుల్కల్‌లో ఒకటి, అన్నారంలో ఒక టి, బీర్కూర్‌లో రెండు, ఎల్లారెడ్డిలో ఒకటి, మోర్తాడ్ నుంచి బాన్సువాడకు వలసవచ్చిన ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ప్రజలు అప్రమత్తంగాఉండాలని, మాస్కులు ధరించా లని, భౌతికదూరం పాటించాలని సూచించారు. దుబ్బ, మాలపల్లి, వినాయక్‌నగర్, ముదక్‌పల్లి, ఆర్మూర్, ఆలూర్‌లో ఒకటి చొప్పున, గౌతంనగర్‌లో నాలుగు, సీతారాంనగర్‌లో రెండు, ర్యాపిడ్ టెస్టుల ద్వారా మరోరెండు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

కరోనాబారిన పడి చికిత్స పొందుతున్న నలుగురికి మళ్లీ టెస్టులు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కరోనా లక్షణాలతో మృతి చెందినట్లు పుకార్లురావడంతో అతడి కుటుంబ సభ్యులకు టెస్టులు చేశారు. ర్యాపిడ్ టెస్టుల ద్వారా పదినిమిషాల్లో రిపోర్టురాగా, జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలో తొమ్మిది కేసులు నమోదైనట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుదర్శనం తెలిపారు. ప్రతి పీహెచ్‌సీలో శుక్రవారం కరోనా లక్షణాలు ఉన్న వారికి టెస్టులు నిర్వహిస్తామన్నారు. పాజిటివ్ వచ్చిన రోగులకు ప్రభుత్వ దవాఖాన లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని, 200 పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తిరుమల దవాఖానలో మరో 100 పడకలను సిద్ధం చేశామన్నారు. బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు మొత్తం 16 మందికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. ముగ్గురు వైద్య సిబ్బందితోపాటు వారి సంబంధీకులు నలుగురికి పాజిటివ్ నిర్ధారణ కావడం పట్టణంలో కలకలంరేపింది.



వనపర్తిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి

# పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

## –మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, జులై 20: వనపర్తికి కొత్తగా 1500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు అయ్యాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి పరిశీలించి మాట్లాడారు. వనపర్తి పట్టణంలో ఇప్పటికే పెద్దగూడెం రోడ్, చిట్యాల, అప్పాయిపల్లి రోడ్లలో నిర్మాణంలో ఉన్న ఇండ్లకు అదనంగా ఇవి మంజూరైనట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో 700, వనపర్తి నియోజకవర్గంలో 800 ఇండ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. పారదర్శకంగా అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయిస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యాలు అని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రభుత్వ పథకాలు ఉన్నాయని కొనియాడారు. కరోనా సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అదనంగా ఇండ్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన గ్రామాల్లో అంటువ్యాధుల భయం

## కరోనాతో ఏది తేల్చుకోలేక పోతున్న జనం
## జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యాధికారులు
## అనుమానిత కేసులపై నిరంతర నిఘా

హైదరాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఇప్పుడు అంటు వ్యాధులపై ఆందోళన నెలకొంది. ఓ వైపు కరోనా భయం. .మరోవైపు మరో వైపు అంటువ్యాధుల భయం చుట్టుముడు తున్నాయి. దీంతో ఏది కరోనా, ఏది సీజనల్ వ్యాధి అని అర్థం కాని పరిస్థితుల్లో జనం హైరానా పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో క్రమంగా విష జ్వరాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఏజెన్సీ గూడాల్లో సీజనల్ వ్యాధుల విజృంభన మొదలైంది. కరోనా, విష జ్వరాల ప్రాథమిక లక్షణాలు ఒకేరకంగా కన్పిస్తుండడంతో ఏవ్యాధో గుర్తించటం కష్టంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అయితే రెండింటి ప్రాథమిక లక్షణాలు ఒకే మాదిరిగా ఉన్నా జిల్లాల్లో మొదలైన కరోనా కేసుల వ్యాప్తిని అనుసరించి అనుమానిత కేసులను నిరంతరం పరిశీలిస్తున్నామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. సాధారణ జ్వరాల నుంచి కరోనా లక్షణాలను ప్రత్యేకంగా గుర్తించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయా జిల్లాల వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వర్షాల కారణంగా చలితో కూడిన విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. కొవిడ్–19కు సమాంతరంగా సీజనల్ వ్యాధుల నియంత్రణకు కార్యాచరణ అమలు చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నా కరోనా కేసులు పెరుగు తుండడంతో జలుబు చేసి వ్యక్తులను చూసి కూడా జనం భయపడుతున్నారు. అయితే కరోనా కేసులన్నీ అసింప్టమాటిక్ కేసులుగానే నిర్ధారించారు. కేవలం కొన్ని కేసులు మాత్రమే స్వల్ప లక్షణాలు కలిగినవిగా గుర్తించారు. కేసుల సంఖ్య పెరుగుతున్న కారణంగా జిల్లాల్లోనూ కరోనా టెస్టులు చేసి, చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ప్రస్తుతం అంటువ్యాధుల సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ జ్వరాలకు, కొవిడ్–19 లక్షణాల మధ్య వ్యత్యాసాన్ని కనుగొనటం కొంత వరకు ఇబ్బందికరంగా ఉంది. అయినప్పటికీ సాధారణంగా వర్షంలో తడిసిన తర్వాత జలుబుతో కూడిన జ్వరం వస్తే భయపడకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా చలితో కూడిన జ్వరం వస్తే దానిని సాధారణ విష జ్వరంగానే భావించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కొవిడ్–19 లక్షణాల్లో ఇదే తరహా పరిస్థితులు కన్పిస్తున్నా జ్వరం తీవ్రతలో కొంత వ్యత్యాసం ఉంటుందని చెబుతున్నారు. జిల్లాల్లో కరోనా సోకిన వ్యక్తులకు ఇప్పటి వరకు ఎలాంటి లక్షణాలు లేకుండానే పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కరోనా సోకిన వ్యక్తుల్లోనూ జ్వరం, తలనొప్పి, జలుబు, ఛాతిలో నిప్పి, విరేచనాలు వంటి లక్షణాలుంటాయి. ముఖ్యంగా పాజిటివ్ సోకిన వ్యక్తులతో సాంఘికంగా మెలిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. స్వీయ నిర్బంధంలో ఉండి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సీజన్ కావటంతో రైతులు వివిధ పనుల కోసం పట్టణాలకు వెళ్లి వస్తున్న నేపథ్యంలో అలాంటి వారికి చిన్నపాటి జ్వరం సోకిన కూడా భయంతో వణికిపోతున్నారు. లాక్‌డౌన్ సడలించడంతో ముంబై, ఢిల్లీ, పుణెళి, కలకత్తా వంటి ప్రాంతాల నుంచి వలస కార్మికులు స్వస్థలాలకు రావటంతో రెండో విడత కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయి. ఎక్కడో ఓచోట రోజుకో పాజిటివ్ ఒక పాజిటివ్ కేసు చొప్పున నమోదు అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# శిక్షణలోని ప్రతిఅంశపై శ్రద్ధాసక్తులు కనబర్చాలి

## –కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, జులై 20 (నేటినిజం ప్రతినిధి): శిక్షణలోని ప్రతిఅంశంపై శ్రద్ధాసక్తులు కనబర్చాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. శిక్షణలోని ప్రతిఅంశం విధినిర్వాహణ సందర్భంగా ఉపయోగపడుతుందని చెప్పారు.

కరీంనగర్‌లోని సిటిపోలీస్ శిక్షణ కేంద్రం(సిపిటిసి)లో శిక్షణ పొందుతున్న పోలీసులు గతరెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ కార్యక్రమం ఆదివారం నాడు ముగిసింది. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విధినిర్వాహణను సమర్ధవంతంగా కొనసాగించడంద్వారానే సత్ఫలితాలను సాధించవచ్చున్నారు.

వేలాదిమందితో పోటీపడి సాధించిన ఈ ఉద్యోగాన్ని అదృష్టంగా భావించాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ద్వారా ఇప్పటికే గుర్తింపు పొందినమీరందరూ పదవివిరమణ వరకు విధుల్లో సమర్ధవంతంగా రాణిస్తూ రోల్‌మోడల్‌గా నిలువాలన్నారు. శారీరక ధృఢత్వం, ఆరోగ్యాన్ని పరిరక్షించ ుకునేందుకు ఏదో ఒక ఆటను ఎంపికచే సుకుని అందులో రాణించడంతోపాటు, వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా అలవర్చుకున్నట్లైతే మానసికం గా,శారీ రకంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంటారని తెలిపారు. శిక్షణలోని ప్రతిఅంశం తమకు ఉపయోగపడుతుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఈ సందర్భంగా తను ట్రైనింగ్ కొనసాగించినకాలంలోని అనుభవాలను శిక్షణపోలీసులకు వివరించారు. మీరుసాధించే ప్రతివిజయంలో మీరు ఏతైంతే సంతోషిస్తారో మీకు శిక్షణ ఇస్తున్న గురువులు అంతకు రెట్టింపుస్థాయిలో ఆనందపడుతారని తెలిపారు.

రెండురోజులపాటు నిర్వహించిన ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో శిక్షణలో పోలీసులకు షాట్‌పుట్, చెస్, బ్యాట్మింటన్, వాలీబాల్,కబడ్డీ,క్రికెట్ విభాగాల్లో నిర్వహించారు. విజేతలకు పోలీస్ కమిషనర్ బహుమతులను అందజేశారు. పోలీస్ కళాబృందం ఇంఛార్జి రామంచ తిరుపతి బృందం ఆటపాటలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శిక్షణ పొందుతున్న పోలీసులు కూడా ఈ సందర్భంగా తమలో ఉన్న వివిధ రకాల ప్రతిభలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో సిపిటిసి ప్రిన్సిపల్, అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ) ఎస్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ శివభాస్కర్, సిపిటిసి ఇండోర్,అవుట్‌డోర్ విభాగాలకు చెందిన అధికారులు నాగేందర్, నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్‌లతోపాటు వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జో బైడెన్ గెలుపొందితే భారత్‌లో మరింత బంధం

## – చర్చనీయాంశంగా రిచర్డ్ వర్మా వ్యాఖ్యలు

వాషింగ్టన్,జూలై20(ఆర్ఎన్ఎ): అమెరికాలో అధ్యక్ష పదవికి ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. నవంబర్ 3న జరిగే ఈ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలోకి దిగుతున్నారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌ను ఢీ కొననున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ట్రంప్.. ప్రయత్నాలు ప్రారంభించారు. అక్కడ ఉన్న భారతీయుల ఓట్లను కొల్లగొట్టడానికి యత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో గతంలో ఇండియా లో అమెరికా రాయబారిగా పని చేసిన రిచర్డ్ వర్మా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఓ సమావేశంలో మాట్లాడిన ఆయన.. రానున్న అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ గెలుపొందితే.. భారత్ చిరకాల స్వప్నం నెరవేరడానికి బైడెన్ కృషి చేస్తారని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వం పొందటానికి బైడెన్ సహాయం చేయనున్నట్లు రిచర్డ్ వర్మా వెల్లడించారు. అంతేకాకుండా భారతీయులకు, ఇండియన్–అమెరికన్లకు మంచి స్నేహితుడిగా బైడెన్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉందన్నారు. కాగా.. 2014–17 మధ్యకాలంలో భారత్‌లో అమెరికా రాయబారిగా పని చేసిన రిచర్డ్ వర్మా.. ప్రస్తుతం జో బైడెన్‌కు మద్దతు తెలుపుతూ, ఎన్నికల ప్రచారంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అమెరికాలో ఇండియన్–అమెరికన్ల జనాభా 2.4 మిలియన్ల వరకు ఉంటుంది. ఇందులో చాలా మంది రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించ రుకోనున్నారు. ఈ క్రమంలో రిచర్డ్ వర్మా చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# అంతరిక్ష రంగంలో ఎమిరేట్స్ చరిత్ర

## మార్స్ గ్రహానికి ఆర్బిటార్‌ను పంపిన తొలి అరబ్ దేశం

న్యూఢిల్లీ,జూలై20(ఆర్ఎన్ఎ): అంతరిక్ష రంగంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర సృష్టించింది. మార్స్ గ్రహానికి ఆర్బిటార్‌ను పంపిన తొలి అరబ్ దేశంగా నిలిచింది. సోమవారం తెల్లవారుజామున 1.58 నిమిషాలకు ఈ ప్రయోగం జరిగింది. మార్స్ గ్రహానికి వెళ్తున్న రాకెట్‌లో.. ప్రోబ్ ఆర్బిటార్ ఉన్నది. అయితే ప్రయోగం చేసిన గంట తర్వాత వ్యోమనౌక నుంచి ప్రోబ్ ఆర్బిటార్ వేరైంది. మితుషుబిషి హెవీ ఇండస్ట్రీస్ ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. ప్రయోగం జరిగిన కొన్ని నిమిషాల్లో ప్రోబ్ టెలికాం సిస్టమ్‌ను సెటప్ చేశారు. ప్రోబ్ ఆర్బిటార్ సిగ్నల్స్ కూడా అందించింది. దుబాయ్‌లోని అల్ కవనీజ్ వద్ద ఉన్న మిషన్ కంట్రోల్ టీమ్‌కు ఆ సిగ్నల్స్ కూడా అందాయి. అల్ అమాల్ లేదా ద హోప్ అనే ప్రోబ్ ఆర్బిటార్‌ను .. అంగారక గ్రహానికి పంపిస్తున్నారు. ఆ ప్రోబ్ బరువు 1.3 టన్నులు. జపాన్‌లో ఉన్న తనెగాషిమా స్పేస్‌పోర్ట్ నుంచి దీన్ని ప్రయోగించారు. హెచ్–2ఏ రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరిగింది. దీని కోసం ఎమిరేట్స్ ప్రభుత్వం 735 మిలియన్ల దీరమ్‌లను ఖర్చు చేసింది. ఆరేళ్లుగా ఎమిరేట్స్ ప్రభుత్వం ఈప్రాజెక్టు కోసం కృషి చేస్తున్నది. మొత్తం 135 మంది ఎమిరేట్ ఇంజినీర్లు, సైంటిస్టులు, పరిశోధకులు ఈ ప్రాజెక్టులో పాల్గొన్నారు. రోదసి నుంచి ప్రోబ్ ఆర్బిటార్ సిగ్నల్ పంపడంతో.. దుబాయ్‌లో ఆనందోత్సహాలు వెల్లువెరిశాయి. హోప్ ప్రోబ్‌కు సోలార్ ప్యానెల్స్‌ను అమర్చారు. ఆ ప్యానెల్స్.. బ్యాటరీలను ఛార్జ్ చేస్తాయి. వాటితోనే ఆ ప్రోబ్ సుమారు 495,000,000 కిలోమీటర్లు జర్నీ చేయనున్నది.

# రామాలయంతో కరోనాను అరికట్టలేరు: శరద్ పవార్

ముంబై,జూలై20(ఆర్ఎన్ఎ): అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ముహూర్తం ఖరారైన విషయం తెలిసిందే. అయితే ఆ ఆలయ నిర్మాణాన్ని ఎన్సీపీ నేత శరద్ పవార్ తప్పుపట్టారు. రాముడి ఆలయ నిర్మాణంతో కరోనా వైరస్‌ను అంతం చేయాలేరని ఆయన విమర్శించారు. కరోనా వైరస్, లాక్‌డౌన్‌తో దెబ్బతిన ఆర్థిక వ్యవస్థపై దృష్టి పెట్టాలని పవార్ అభిప్రాయపడ్డారు. మందిరం నిర్మిస్తే వైరస్ పోతుందన్న భ్రమలో కొందరు ఉన్నారని ఎన్సీపీ నేత ఆరోపించారు.

# ప్రైవేట్ టీచింగ్ స్టాఫ్‌కు జీతాలు ఇప్పించాలి: చాడ

హైదరాబాద్,జూలై20(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కారణంగా మార్చి నుండి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు బంద్ అయ్యాయని, దీంతో వాటిల్లో పని చేసే ఉద్యోగులకు వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు వేతనాలు చెల్లించేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఉద్యోగుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని చాడ డిమాండ్ చేశారు.

# పాఠశాలల్లో మొక్కలు నాటాలి

## జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్

మెదక్,జూలై20(నేటినిజం ప్రతినిధి): ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. సాధ్యమైనన్ని మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఇప్పుడు పాఠశాలలు నడవడం లేదనందున ఇందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి ఎస్ఎంసీ, గ్రామ పంచాయతీ తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. గురువారం ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 14వేల మొక్కలు నాటామన్నారు. హరితహారంలో భాగంగా అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఉపాధిహామీ కూలీలతో తండా అటవీ ప్రాంతంలో సుమారు 4వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. గ్రామాల్లో మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు.

# శిక్షణ శిబిరాలపై కసరత్తు: రిజిజు

న్యూఢిల్లీ.జులై 20: కరోనా వైరస్ మహమ్మారి విజృంభణ కారణంగా నిలిచిపోయిన వివిధ క్రీడల జాతీయ క్యాంప్‌లను తిరిగి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజిజు విధివిధానాలపై కసరత్తు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం జరిగితే ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో మన అథ్లెట్లు వెనుకబడి పోతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాల్లో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విడతల వారిగా శిక్షణ శిబిరాలు ప్రారంభించాలనుకుంటున్నాం. బాక్సర్లంతా పటియాలకు చేరుకున్నారు. క్వారంటైన్ గడువు మిగిశాక నిబంధనల మేరకు వారి శిక్షణ ప్రారంభమవుతుంది. ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొననున్న అథ్లెట్ల ప్రాక్టీస్‌పై దృష్టిపెట్టాం. హాకీ, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడాకారులతో స్వయంగా మాట్లాడా. వారి శిక్షణ చక్కగా సాగుతున్నది. అదే రీతిలో ఇతర క్యాంప్‌లు కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలెట్టాం‘ అని సోమవారం ఓ ఇంటర్వ్యూలో రిజిజు చెప్పారు.

# సాగుభూములపై హక్కులు కల్పించాలి

విశాఖపట్టణం,జూలై20(ఆర్ఎన్ఎ): ఏజెన్సీలో అర్హుడైన ప్రతి గిరిజనుడికి అటవీ సాగు భూములకు హక్కులు కల్పించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. పంచాయతీ స్థాయిలో గ్రామసభలు నిర్వహించకుండా అందుబాటులో ఉన్న జాబితా మేరకు మాత్రమే హక్కు పత్రాలు అందించాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారన్నారు. అలా కాకుండా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ హక్కు పత్రాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కరోనా కట్టడిలో వైద్య సిబ్బంది పని తీరు భేష్ : మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ,జులై 20: కరోనా కట్టడిలో ఉమ్మడి నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు భేషుగ్గా ఉందని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సరిహద్దుల్లో సైనికుల్లా పనిచేస్తున్న వైద్య సిబ్బంది పనితీరుతో దవాఖానలపై ప్రజల్లో విశ్వసనీయత పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. కొవిడ్–19పై ఆయన సోమవారం సాయంత్రం ఉమ్మడి నల్గొండ జిల్లాల కలెక్టర్లు ప్రశాంత్ జీవన్ పాటిల్,వినయ్ కృష్ణారెడ్డి, అనితా రామచంద్రన్ లతో పాటు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వైద్య ఆరోగ్యశాఖాదికారులు, నల్గొండ, సూర్యా పేట మెడికల్ కళాశాల ప్రిన్సి పాల్స్, వైద్యాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహన లేక అక్కడక్కడా జరుగుతున్న అంశాలపై అపశృతులు దొర్లుతున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. నిజానిజాలు ఏమిటో ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు అన్నారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక వ్యాధి నుంచి సామాన్య పేద ప్రజలను కాపాడే వైద్య ఆరోగ్య సిబ్బంది మనోధైర్యం కోల్పోవద్దన్నారు. సమాచార లేమితో పుకార్లు షికార్లు చేస్తున్నాయని ప్రభుత్వం అన్నీ గమనిస్తోందని ఆయన చెప్పారు. అయితే అదే సమయంలో 24 గంటలు పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది అసహనాని కి లోను కావొద్దన్నారు. కరోనాను అరికట్టడంలో మన రాష్ట్రం ముందుందని మంత్రి తెలిపారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో సామాన్య పేద ప్రజానీకం ప్రభుత్వ వైద్య శాలలకు తరలి రావడమే ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు. కొవిడ్ రోగుల్లోనూ మనోధైర్యాన్ని పెంపొందించేందుకు సిబ్బంది పడుతున్న శ్రమ అద్భుతమైన ఫలితాలు ఇస్తుందన్నారు. ఇకపై డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఏరియా దవాఖానల్లోనూ కొవిడ్ టెస్ట్ లు ఉంటాయని మంత్రి వెల్లడించారు. నల్గొండ, సూర్యాపేట దవాఖానల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

# యాదయ్యది సహజ మరణమే

## కరోనా సోకలేదని కలెక్టర్ వివరణ

నల్గొండ,జూలై20(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో కోవిడ్ ఐసోలేషన్ వార్డ్ లో చికిత్స పొందుతూ బి.యాదయ్య మృతి చెందిన సంఘటనలో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదని, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. వేములపల్లి మండలం సల్కూర్ కు చెందిన బి. యాదయ్య (40) జూలై 17 న తీవ్ర శ్వాస సమస్య, దగ్గు, జ్వరంతో అడ్మిట్ అయినట్లు తెలిపారు. కొవిడ్ ఐసీయూ, ఐసొలేషన్ వార్డ్ లో యాదయ్యతో పాటు 19 మంది అనుమానిత కరోనా బాధితులు, 21 మంది పాజిటివ్ రోగులకు వైద్య సిబ్బంది, డాక్టర్ లు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. యాదయ్య కొవిడ్‌తో చనిపోలేదని, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి (అక్షఖఅ) , అల్కహాలిక్ లివర్ వ్యాధితో బాధ పడుతున్నారని వివరించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఈ నెల 18న వైద్య సేవలు అందించి శాంపిల్స్ సేకరణ చేశారని పేర్కొ న్నారు. వాటిని హైదరాబాద్‌కు పరీక్ష నిమి త్తం పంపించామన్నారు. డి పార్ట్ మెంట్ ఆఫ్ బయటెక్నాలజీ లేబరేటరీ, ఉప్పల్ ఇంటరిమ్ రిపోర్ట్ లో కొవిడ్ నెగటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# కరోనా నియంత్రణలో ఏపి సర్కార్ విఫలం: వెలగపూడి

విశాఖపట్టణం,జూలై20(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రణలో ఏపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. రోజు రోజుకు కేసులు పెరుగుతున్నా.. ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని మండిపడ్డారు. కరోనాతో చనిపోయిన వారికి ప్రత్యేక శ్మశానాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ముఖ్యంగా విశాఖ జిల్లాలో పాజిటివ్ కేసులుగానీ, మృతుల సంఖ్య గానీ విపరీతంగా పెరుగుతున్నాయన్నారు.

పరీక్షలు చేసిన తర్వాత వారం రోజుల వరకు రిపోర్టులు ఇవ్వడంలేదని, ఈ లోపల వాళ్లు ఇష్టమొచ్చినట్లు తిరుగడంవల్లే కరోనా వ్యాప్తి చెందుతోందని ఎమ్మెల్యే రామకృష్ణబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. టెస్టు చేసిన వ్యక్తికి 24 గంటల్లో రిపోర్టు ఇస్తే మృతుల సంఖ్య, కేసులు తగ్గుతాయన్నారు. ఒకవేళ పాజిటీవ్ వచ్చిన పేషెంట్లను అంబులెన్స్ వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్ళడానికి ఒక రోజు దాటుతుందన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి జగన్ కుయ్ కుయ్ మంటూ అంబులెన్సులు ప్రారంభించారని, జిల్లాకు వచ్చేసరికి అంబులెన్సులు కుయ్యో ముర్రో అంటున్నాయని రామకృష్ణబాబు విమర్శించారు

# వైకాపా నేత బర్త్‌డే పార్టీ

## పాల్గొన్న వారికి కరోనా

రాజమండ్రి,జూలై20(ఆర్ఎన్ఎ): కరోనాను నివారించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవిరాళంగా కృషి చేస్తున్నాయి. అయితే ప్రభుత్వాల నిర్ణయాలను, ఆదేశాలను రాజకీయపార్టీల నేతలు తుంగలో తొక్కేస్తున్నారు. బర్త్ డే పార్టీలతో పాటు రాజకీయ కార్యక్రమాల్లో కరోనా నివారణ చర్యలను ఖాతరు చేయడం లేదు. కరోనా ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల్లో పుట్టినరోజు వేడుకలను అధికార పార్టీ నేతలే నిర్వహించడం గమనార్హం. అటు టీఆర్ఎస్ నేతలు, ఇటు వైసీపీ నేతలు ఘనంగా వేడుకలను నిర్వహిస్తూ.. చిక్కులు తెచ్చిపెడుతున్నారు. దాని ఫలితం సామాన్య ప్రజలపై పడుతోంది.

ఏపీలో అధికార పార్టీకి చెందిన ఓ నేత పుట్టినరోజు వేడుకను ఆయన అనుచరులు ఘనంగా నిర్వహించారు. అదెక్కడో కాదు కరోనా హాట్‌స్పాట్ అయిన తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించారు. జిల్లాలోని రావులపాలెం మండలం ఊబలంక బర్త్ డే పార్టీలో కరోనా కలకలం రేగింది. ఊబలంక గ్రామంలో వైసీపీ యువనేత బర్త్ డే వేడుకలను గ్రాండ్‌గా జరిపారు. పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న పలువురు అనారోగ్యానికి గురయ్యారు. కొంతమందిలో కరోనా లక్షణాలు బయపడడంతో కంగారు పడ్డారు. ఈనెల 17న ఊబలంక పీహెచ్‌సీలో నిర్వహించిన కరోనా పరీక్షల్లో బర్త్ డేలో పాల్గొన్న 25 మందితో పాటు ఆయా కుటుంబాల్లోని వారికి కలిపి మొత్తం 45 మందికి కరోనా సోకింది. ఈ వేడుకలో పాల్గొన్న మరో 81 మంది ఫలితాలు ఇంకా రాలేదు. దీంతో ఊబలంక గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. రావులపాలెం, ఊబలంక గ్రామస్తులను బర్త్ డే వేడుకల భయం వెంటాడుతోంది.

# ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా .. తప్పిన ప్రమాదం



భద్రాద్రి కొత్తగూడెం,జులై 20 : ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు లారీని తప్పించబోయి బోల్తా పడిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పుష్కరవనం వద్ద సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి జగదల్పూర్ వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన బస్సు సారపాక సమీపంలో.. పుష్కరవనం వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. అయితే బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో డ్రైవరుకు కూడా ఏమి కాలేదని తెలిసింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని బోల్తా పడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీశారు. బూర్గంపాడు ఎస్ఐ బమ్మెర బాలకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి

స్మారక కవితల పోటీలు

కరోనా మహమ్మారి విజృంబన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి

“వలస కార్మికులు”

అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:

- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:

1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–20.

E-mail : netinizam2020@gmail.com

కవితలు పంపాల్సిన చివరి తేది : 15-8-2020


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com